క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్‌: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జబ్బర్‌తోటలో మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న అధికారులు, మహారాణిపేట తహసీల్దార్ జిలానీ

మహారాణిపేట: చెంగల్రావుపేటలోని జబ్బర్ తోటలో మంగళవారం సునామీ మాక్ డ్రిల్ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మహారాణిపేట తహసీల్దార్ జిలానీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, పోలీసులు, పంచాయతీరాజ్, విపత్తుల ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల విభాగం, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఎలా వెళ్లేది?



24వార్డు టీపీటీ కాలనీలో సాయిబాబా ఆలయ రహదారిపై భవన నిర్మాణ సామగ్రి

సీతమ్మధార : భవన నిర్మాణ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. రహదారిని ఆక్రమించి నిర్మాణ సామగ్రి డంప్ చేస్తున్నారు. దీంతో ద్విచక్రవాహనాలు, కార్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టీపీటీ కాలనీలోని సాయిబాబా ఆలయ సమీపంలో రోడ్డును ఆక్రమించి ఇసుక, పిక్క అడ్డంగా వేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో భవన నిర్మాణ యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

యూపీహెచ్‌సీ సందర్శన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆశ డే సందర్భంగా విద్యుత్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ ఆశా డే లో న్యూ బోర్న్ కేరింగ్, గ్రోత్ మానిటరింగ్ చార్ట్, న్యుమోనియా ఏ విధంగా ముందుగా తెలుసుకోవాలి, స్పేసింగ్ మెథడ్స్ ఏ విధంగా పాటించాలో అవగాహన కల్పించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, వివిధ విభాగాల ఇన్‌చార్జులు వి.నారాయణరావు, నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మురళీనగర్: సూర్యానగర్–2 జాతీయ రహదారిని ఆనుకుని వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో తమలపాకులతో నామాచార్చన చేశారు. అనంతరం స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నిబంధనలకు విరుద్ధం.. సమస్యలకు ఆలవాలం

అసలే రద్దీగా ఉండే పూర్ణామార్కెట్ కొంత మంది వ్యాపారుల అనుచిత వైఖరి వల్ల మరింత రద్దీగా మారుతోంది. ఈ ప్రాంతంలో ఉండే వ్యాపారులు సెల్లార్లను పార్కింగ్‌కు వినియోగించి.. గ్రౌండ్ ఫ్లోర్‌లో వ్యాపారాలు చేసుకోవాలని జీవీఎంసీ నిబంధనలు విధించింది. అయితే దీనిని తుంగలో తొక్కుతూ కొంత మంది వ్యాపారులు ఇష్టారీతి వ్యవహరిస్తున్నారు. దీని వల్ల ట్రాఫిక్ జామ్ అయి పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- పూర్ణామార్కెట్‌లో వ్యాపారుల అడ్డగోలు లావాదేవీలు
- సెల్లార్లలో వ్యాపారం.. పార్కింగ్‌కు పంగనామం
- రద్దీతో ఇక్కట్ల పాలవుతున్న పాదచారులు, వాహన చోదకులు



పూర్ణామార్కెట్‌లో అస్తవ్యస్తంగా నిలిపిన వాహనాలు

జగదాంబ: జీవీఎంసీ నిబంధనలను వ్యాపారులు తుంగలో తొక్కేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి సెల్లార్లలో పార్కింగ్ చేసుకుని గ్రౌండ్ ఫ్లోర్‌లో వ్యాపారాలు చేసుకోవాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ పూర్ణామార్కెట్‌లో కొంత మంది వ్యాపారులు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న షాపుల సెల్లార్లలో దుకాణాలు నిర్వహించుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నగరంలో అత్యంత కీలకమైన పూర్ణామార్కెట్ నిత్యం జనసంచారంతో రద్దీగా ఉంటుందనే విషయం తెలిసిందే. అయితే ఇక్కడి హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. విశాఖపట్నంతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, ఒడిశా నుంచి కూడా పూర్ణామార్కెట్‌కు కొనుగోలు నిమిత్తం వినియోగదారులు పెద్ద ఎత్తున వస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే ఈ మార్కెట్‌లో వ్యాపారులు నిబంధనలు కాలరాస్తూ సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహించడం వల్ల ఆయా దుకాణాలకు కొనుగోలు నిమిత్తం వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కు వీలు లేక దుకాణాల ముందు నిలిపి ఉంచడం వల్ల విపరీతమైన రద్దీ నెలకొంటుంది. దీనివల్ల ట్రాఫిక్ జామ్ అవుతూ పాదచారులు, వాహన చోదకుల రాకపోకలు సాగించే వీల్లేకుండా ఉంది.



లారీ అడ్డంగా ఆపి సరకు అన్‌లోడ్ చేస్తుండడంతో రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్

పండగ సమయాల్లో సమస్య మరింత తీవ్రం..

పండగల సమయంలో పూర్ణామార్కెట్‌లో ట్రాఫిక్ జామ్ తీవ్రంగా ఉంటుందని వినియోగదారులు వాపోతున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి పండగల సమయంలో మార్కెట్‌కు వెళ్లి రావడం బ్రహ్మప్రళయంగా మారుతుందని అంటున్నారు. జనసంచారంతో రద్దీగా ఉండే మార్కెట్‌లో ట్రాఫిక్ నిబంధనల ప్రకారం మార్కెట్‌కు వచ్చే భారీ వాహనాలు ఉదయం పది గంటల లోపు సరకు అన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. కానీ ఎవరితో ఎవరు కుమ్మక్కు అవుతున్నారో తెలియదు కానీ.. మధ్యాహ్నం, సాయంత్రం కూడా నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారిలో భారీ వాహనాలు అడ్డంగా పెట్టి దుకాణాలకు వచ్చే సరకును భారీ వాహనాల నుండి అన్‌లోడ్ చేస్తుంటారు. కేవలం ద్విచక్ర వాహనం రాంగ్ పార్కింగ్‌లో ఉంటే ఫొటోలు తీసి చలనాలు పంపించే ట్రాఫిక్ పోలీసులు భారీ వాహనాలు రహదారికి అడ్డంగా ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

సెల్లార్లలో దుకాణాలు ఉంటే తొలగిస్తాం..



జీవీఎంసీ నిబంధనల ప్రకారం సెల్లార్లలో దుకాణాలు నిర్వహించకూడదు. అక్కడ వాహనాలు మాత్రమే పార్కింగ్ చేసుకోవాలి. దీనిపై సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తాం. ఎవరైనా సెల్లార్లలో దుకాణాలు నిర్వహిస్తుంటే వెంటనే తొలగిస్తాం. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

– ఝాన్సీ, అసిస్టెంట్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ విభాగం, జీవీఎంసీ జోన్–4

7న చట్ పూజా వేడుకలు



మాట్లాడుతున్న ఛట్ పూజా విశాఖ సమితి అధ్యక్షుడు ప్రకాష్ భర్తియా

దాబాగార్డెన్స్‌: సాగరతీరాన ఈ నెల 7 నుంచి చట్ పూజా వేడుకలు నిర్వహించనున్నట్టు పూజా సమితి తెలిపింది. సమితి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రధానంగా బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున జరుపుకునే ఛట్ పూజను ఆ రోజు సాయంత్రం 4 గంటలకు పాండురంగాపురం టెంపుల్‌కు ఎదురుగా గల బీచ్‌లో నిర్వహించనున్నట్టు చెప్పారు. సూర్య భగవానుకి తన సోదరి 'చేట మాత'ద్వారా అర్ఘ్యం అందజేయడం చట్ పూజా విశేషమన్నారు. కార్తీక షష్ఠి తిథి సూర్య భగవానుకి అత్యంత ప్రీతికరమైన రోజని, సూర్యుడు, చేట మాత అన్నా చెల్లెళ్లుగా, బ్రహ్మ దేవుని సంతానంగా పురాణాలు చెబుతున్నాయన్నారు. ఆ రోజు సాయంత్రం చట్ మాత సూర్య దేవుని సందర్శించి చేటతో అర్ఘ్యం ఇచ్చి, మర్నాడు ఉదయం మరలా అర్ఘ్యం ఇచ్చి ఆయన ఆశీర్వాదం పొందారని, అట్టి ఆచారాన్ని ఉత్తర భారతంలో ప్రజలంతా కొనసాగిస్తున్నారని విశాఖ నగర ఛట్ పూజా సమితి అధ్యక్షుడు ప్రకాష్ భర్తియా తెలిపారు. 7న సాయంత్రం బీచ్ రోడ్డున నిర్వహించే ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొనాలని కోరారు. సమితి సభ్యులు సుభాష్ చంద్రరాయ్, ప్రకాష్ భర్తియా, వికాస్ భర్తియా, ఆనంద్ పాథక్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా విశాఖలో వేడుకగా ఛట్ పూజ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విశాఖ వాసులు ఛట్ పూజలో పాల్గొని సూర్య భగవానుడి ఆశీస్సులు పొందాలని తెలిపారు.

పండుటాకుల విహార యాత్ర



ఆర్కే బీచ్ వద్ద వివేకానంద ఆశ్రమ వాసులు

దాబాగార్డెన్స్‌: నాగుల చవితి సందర్భంగా పాత నగరంలో గల వివేకానంద అనాథాశ్రమ వాసులు ఆర్కే బీచ్‌లో విహార యాత్ర చేశారు. సాయంత్రం వేళ ఆర్కే బీచ్ సమీపాన గల రామకృష్ణ మఠాన్ని ముందుగా దర్శించుకుని, ఆర్కే బీచ్‌లో రెండు గంటల పాటు చక్కగా గడిపారు. అంతా కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఆనందంగా గడిపారు. వివేకానంద సంస్థ వారు తమను ఇలా బీచ్, పార్కులు, దేవాలయాలకు తీసుకెళ్లడం వల్ల తమను పిల్లలు వదిలేశారని, ఎవ్వరూ లేరనే బాధలు మరచిపోయి సంతోషంగా ఉంటున్నామని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ వారి సంతోషం కోసం వారంలో ఒకసారి బయటికి తీసుకొస్తున్నామని తెలిపారు.

ఆపన్నులకు ఆశ్రయం



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: ఇంటి నుంచి వచ్చేసిన ఒక వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏయూటీడీ సంస్థ తెలిసిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దుప్పల చినబాబు (64) శ్రీకాకుళం నుంచి విశాఖ వచ్చేశారు. రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా ఆర్‌పీఎఫ్, ఏయూటీడీ సంయుక్త రెస్క్యూ ద్వారా ఆయనను ప్రశ్నించగా హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పారు. కాని ఆయన వద్ద ఎటువంటి రైలు టికెట్ లేకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది టీఎస్‌ఆర్ కాంప్లెక్సులో గల నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. ఈ నేపథ్యంలో అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వసతిగృహానికి వచ్చిన అతని మనవడికి వృద్ధుడిని అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

కాకినాడ మహిళకు ఆశ్రయం..


కాకినాడకు చెందిన ఒక మహిళకు టీఎస్‌ఆర్ కాంప్లెక్సులో గల నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించారు. కాకినాడకు చెందిన వృద్ధురాలు గల్లిమెల్ల పద్మావతి (58)కి ఎవరూ లేరు. ఈమె కాకినాడ నుంచి విశాఖపట్నం వచ్చేసి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం వద్ద ఉంది. ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇచ్చారు. కేర్‌టేకర్లు అక్కడికి చేరుకుని సదరు మహిళను ద్వారకానగర్‌లో గల టీఎస్‌ఆర్ కాంప్లెక్సులోని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు పర్యవేక్షణలో మేనేజర్ జ్యోతిర్మయి ఆమెకి మహిళా వసతిగృహంలో ఆశ్రయం కల్పించారు.



వసతిగృహంలో ఆశ్రయం పొందిన కాకినాడ మహిళ

తండ్రి చెంతకు తనయుడు

- ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడు
- టూటౌన్ పోలీసుల చొరవతో కుటుంబ సభ్యులకు అప్పగింత



బాలుడితో టూటౌన్ సీఐ తిరుమలరావు, ఏఎస్‌ఐ కాంతమ్మ

అల్లిపురం: ఇంటి నుంచి పారిపోయి నగరానికి చేరుకున్న బాలుడిని టూటౌన్ పోలీసులు అతని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఈ మేరకు టూటౌన్ సీఐ బి.తిరుమలరావు, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపిన వివరాల ప్రకారం అనంతపురం జిల్లా, గుత్తికి చెందిన 15 సంవత్సరాల బాలుడు తల్లిదండ్రులు చదువుకోమని చెబుతుండడంతో ఒత్తిడికి గురై సోమవారం రాత్రి నగరానికి చేరుకున్నాడు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఒంటరిగా కూర్చుని బాధపడుతున్న అతడిని స్థానికులు గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు అతడి నుంచి వివరాలు తెలుసుకుని బాలుడి కుటుంబ సభ్యులకు తెలిపారు. అతడికి పాపా హోంలో ఆశ్రయం కల్పించారు. మంగళవారం ఉదయం నగరానికి చేరుకున్న అతని తండ్రికి బాలుడిని అప్పగించారు. దీంతో బాలుడి తండ్రి తమ కుమారుడిని భద్రంగా అప్పగించినందుకు సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, టూటౌన్ సీఐ బి.తిరుమలరావు, ఇతర పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ టూటౌన్ సిబ్బందిని అభినందించారు.

9న జాతీయ విద్యా దినోత్సవం

మద్దిలపాలెం: భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని, జాతీయ విద్యా దినంగా ప్రతి ఏడాది నవంబర్ 11న జరుపుకోవడంగా ఆనవాయితీ వస్తోంది. ఈసందర్భాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉదయం 11 గంటలకు డాబాగార్డెన్స్‌లోని ఆదిత్య డిగ్రీ కాలేజీ సెమినార్ హాల్‌లో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని కో ఆర్డినేటర్ డాక్టర్.జి.బాబ్జీ తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ కదిరి కుమార్ బాల, వికాస ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ప్రకాశ్ రావు, ట్రైనర్ ఎస్.వి ఆర్.నాయుడు పాల్గొని ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారన్నారు.

ముగిసిన నిఘా అవగాహనా వారోత్సవాలు



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద నాటిక ప్రదర్శిస్తున్న డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో వారం రోజులుగా జరుగుతున్న నిఘా అవగాహన వారత్సోవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో అవినీతి, లంచగొండితనంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వారం రోజులుగా ఈ అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, పెయింటింగ్, డిబేట్ పోటీలను నిర్వహించారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి నాయకత్వంలో డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం వద్ద అవినీతి రహిత సమాజంపై అవగాహన కల్పిస్తూ నాటికను ప్రదర్శించారు. బాల్యదశ నుంచే అవినీతి, లంచం వంటి విషయాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని రైల్వే అధికారులు సూచించారు.

చల్లగా చూడు.. నాగన్నా



కన్నెమరియమ్మ కొండపై పుట్టలో పాలు పోసేందుకు పోటెత్తిన భక్తులు



ఆంధ్రా మెడికల్ కళాశాల అనాటమీ విభాగం వద్ద పుట్టలో పాలు పోసేందుకు తరలి వచ్చిన భక్తులు

దాబాగార్డెన్స్‌/అల్లిపురం: నాగుల చవితి పండగను భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. యల్లమ్మతల్లి, పోతురాజు పుట్టలతో పాటు అల్లిపురం, రైల్వే క్వార్టర్స్, డీఆర్‌ఎం కార్యాలయం, స్టేషన్‌రోడ్డులో గల ఎంఈఎస్ ఆఫీస్, టూటౌన్ దరి శ్రీశివరామకృష్ణ దేవస్థానం, కెప్టెన్ రామారావు జంక్షన్ యల్లమాంబ ఆలయం, పాతనగరంలోని కన్నె మరియమ్మ కొండ, ఆంధ్రా మెడికల్ కళాశాల అనాటమీ విభాగం, పోర్టు తదితర ప్రాంతాల వద్ద ఉన్న పుట్టల్లో భక్తులు భక్తితో నాదేంద్రునికి పూజలు చేశారు.

రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద..

కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, కోశాధికారి వాసుపల్లి నారాయణ, కమిటీ ప్రతినిధులు ఇక్కడి పుట్టను భక్తుల పూజలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. టెంట్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో భక్తులు పెద్ద సంఖ్యలో నాగేంద్రునికి పాలు పోసి పూజలు చేశారు.



రేణుక యల్లమ్మ దేవాలయం వద్ద గల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సందడిగా రైల్వే క్వార్టర్స్..

రైల్వే క్వార్టర్స్ భక్తులతో సందడిగా మారింది. బెలూన్లు, ఆడుకునే వస్తువులతో ఏర్పాటు చేసిన దుకాణాలతో జాతరని తలపించింది. భక్తులు కుటుంబాలతో తరలి వచ్చి నాగేంద్రునికి భక్తిశ్రద్ధలతో పాలు పోసి పూజలు చేశారు.

శివరామకృష్ణ దేవస్థానంలో..

టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో నాగేంద్రుని పూజించి శక్తిమేర దానాలు చేశారు.

అందరిపై నాగేంద్రుని ఆశీస్సులు ఉండాలి



కుటుంబ సభ్యులతో నాగేంద్రునికి పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్‌: ప్రజలందరిపై నాగేంద్రుని ఆశీస్సులు ఉండాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం కుటుంబ సమేతంగా పుట్టలో పాలు పోశారు. నాగదేవతను ఆరాధించడం మన హిందూ సాంప్రదాయమన్నారు. పాములకు హాని చేయొద్దని, జీవీఎంసీ స్నేక్ క్యాచర్లకు సమాచారం అందించాలని కోరారు. తన మాతృమూర్తి అమ్మాజీ, సతీమణి ఉషారాణి, సూర్య, సౌందర్య రాశి దంపతులు, చిన్న కుమారుడు సాకేత్‌తో కలిసి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు.

పోలీస్ సేవా నిరతి

ట్రిపుల్ రైడింగ్ చేస్తే పట్టుకోలేదు.. డాక్యుమెంట్లు లేవని వాహనాన్ని పక్కకు తీయడం లేదు.. హెల్మెట్ లేదని ఆపలేదు.. కేవలం సాయం చేసే ఉద్దేశ్యంతోనే ఇలా వాహనాన్ని ఈ పోలీసు నెడుతున్నారు. జైలు రోడ్డు జంక్షన్ వద్ద ఒక వాహన చోదకుడు భార్యతో కలిసి వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా బైక్ ఆగిపోయింది. వీల్ తిరగని పరిస్థితి నెలకొంది. దీంతో బైక్‌ను పక్కకు తీయడానికి అతను కష్టపడుతుంటే.. అక్కడే ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇది గమనించారు. వెంటనే వెళ్లి బైక్‌ను రోడ్డు పక్కకు తీసేందుకు ఆ వాహన చోదకుడికి తన వంతు సాయపడి సేవా నిరతి చాటుకున్నారు.



-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

డీఎంహెచ్‌వోతో బేయర్ జైడస్ ఫార్మా ప్రతినిధుల భేటీ



డీఎంహెచ్‌వో జగదీశ్వరరావుతో మాట్లాడుతున్న బేయర్ జైడస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు

మహారాణిపేట: రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) కార్యాలయాన్ని ఢిల్లీకి చెందిన బేయర్ జైడస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు మనోజ్, డాక్టర్ దాలి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుతో పలు విషయాలు చర్చించారు. ప్రిజర్వ్ ది యుటరస్ కాంపెయిన్‌ను డీఎంహెచ్‌వో వివరించారు. అనంతరం శిక్షణ కోసం జిల్లాకు వచ్చిన పలువురు ఆరోగ్య సిబ్బందితో కూడా డీఎంహెచ్‌వో చర్చించారు.

యథేచ్ఛగా ఆక్రమణ



బాలయ్యశాస్త్రి లేఅవుట్ ఫుట్‌పాత్‌పై తోపుడుబండి

సీతమ్మధార: నియోజకవర్గంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. తోపుడు బండ్లు ఏర్పాటు చేసి మరీ వ్యాపారాలు చేయడం గమనార్హం. పలురకాల సామగ్రితో ఫుట్‌పాత్‌లు నిండిపోవడంతో పాదచారులు కాలు పెట్టడానికి సైతం వీలులేకుండా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, టీపీటీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, తదితర ప్రాంతాల్లో గల ఫుట్‌పాత్‌ల మీద హోటల్ వ్యాపారాలు చేసేవారితో నిండిపోయాయి. పలుప్రాంతాలలో సర్వీసు రోడ్ల మీద కూడా బడ్డీలు, ఇతర వ్యాపారాల కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని సెప్టెంబర్ 20న జీవీఎంసీ కమిషనర్ , జోన్–3 కమిషనర్, ఏసీపీలకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు లేఖ రాశారు. అయినా ఇంతవరకూ స్పందన లేదు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.